సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం। 24। నవంబర్। 2023



చాలెంజ్.. టెండర్
పోలింగ్ బూత్‌కు వెళ్లి వేసే ఓటు, పోస్టల్ బ్యాలెట్‌తో పాటు చాలెంజ్ ఓటు, టెండరు ఓట్లకు కూడా ఈసీ అవకాశం కల్పించింది. IIలో



..పకడ్బందీగా నిర్వహించాలి
శాసనసభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని పినపాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ సూచించారు. IIలో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 30°/21°
జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురుస్తాయి. రాత్రికి చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఏపీలోని దేవరపల్లిలో..
భద్రాచలంటౌన్: ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లిలో భద్రాద్రి రామయ్య కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మండపంలో కొలువుదీర్చి కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అంతకుముందు ప్రచార రథంతో పట్టణంలో రామాయణ ప్రచారం నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచ: మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. దేవస్థానంలోని శివలింగానికి ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్చకులతో పాటు ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

27న చండీహోమం..
ఈనెల 27న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పాల్గొనే దంపతులకు అమ్మవారి శేష వస్త్రాలతో పాటు ఉచిత అన్న ప్రసాదం ఏర్పాటు చేశామని తెలిపారు. వివరాలకు 98669 23261 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపు జెడ్పీ సమావేశం

చుంచుపల్లి : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు సీఈఓ ఎం.విద్యాలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

యంత్రాంగం సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న దీపక్‌మిశ్రా, పక్కన జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్ తదితరులు

జిల్లాలో ఎన్నికల ప్రక్రియ వేగవంతం

- అప్రమత్తం చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి
- వివిధ కమిటీల నియామకం

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ జిల్లాలో వేగవంతమైంది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 95 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఎన్నికల నిర్వహణలో వివిధ బాధ్యతల్లో ఉన్న అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, ఈవీఎంల కమీషనింగ్, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు తదితర విషయాలపై అధికారులు పకడ్బందీ కార్యాచరణ రూపొందించి ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నారు.

1,098 పోలింగ్ కేంద్రాలు..
ఎన్నికల నిర్వహణ పర్యవేక్షణకు ముగ్గురు సాధారణ పరిశీలకులు, ఇద్దరు వ్యయ పరిశీలకులు, మరో ఇద్దరు పోలీస్ అబ్జర్వర్లను ఎన్నికల సంఘం నియమించింది. జిల్లాలో 1,098 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 320 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించిన అధికారులు.. వాటిలో మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ఇక 659 పోలింగ్ కేంద్రాల్లో లోపల, 269 కేంద్రాల్లో వెలుపలా వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడడంతో పాటు వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, వీల్ చైర్లు ఏర్పాటు చేస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లో రెండేసి బ్యాలెట్లు
జిల్లాలో ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో నిలిచిన మూడు నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియకు రెండు బ్యాలెట్ల(ఈవీఎం)ను వినియోగించనున్నారు. ఒక్కో ఈవీఎంలో 16 గుర్తులు మాత్రమే ఉంటాయి. అయితే కొత్తగూడెం నియోజకవర్గంలో 30 మంది, ఇల్లెందులో 20 మంది, పినపాకలో 18 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండడంతో ఆయా స్థానాల్లో రెండు చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 9,66,439 మంది ఓటర్లు ఉండగా సమాచార స్లిప్పుల పంపిణీ ప్రక్రియను ఈనెల 18 నుంచి ప్రారంభించారు. ఈసారి నూతనంగా పోలింగ్ స్టేషన్‌తోపాటు పూర్తి వివరాలు తెలియజేసేలా బార్‌కోడ్ ఏర్పాటు చేయడం విశేషం. జిల్లాలో ఎపిక్ కార్డుల ప్రక్రియ గురువారంతో పూర్తయింది.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి..
జిల్లాలోని 1,098 కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు 2,435 బ్యాలెట్ యూనిట్లు, 1,790 కంట్రోల్ యూనిట్లు, 1,777 వీవీ ప్యాట్‌లను సిద్ధంగా ఉంచారు. 1,313 మంది పీఓలు, 1,313 మంది ఏపీఓలు, 2,626 మంది ఓపీఓలు, 306 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు. వీరందరికీ పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.

5,506 పోస్టల్ బ్యాలెట్లు..
జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఈనెల 24 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఐదు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 5,506 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయి. ఇక ఏమైనా అక్రమాలు జరిగితే సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎన్నికల అధికారులు ముందే సూచించగా జిల్లా వ్యాప్తంగా 191 ఫిర్యాదులు వచ్చాయి. అందులో 9 పిటిషన్లను ఫిర్యాదుదారులు ఉపసంహరించుకోగా, మిగిలిన 98 పరిష్కరించారు. అలాగే సువిధ యాప్ ద్వారా వివిధ అనుమతులకు 1,380 దరఖాస్తులు రాగా 932 అనుమతులు జారీ చేశారు. 330 దరఖాస్తులను తిరస్కరించారు. 30 పురోగతిలో ఉండగా 72 పెండింగ్‌లో ఉన్నాయి. ఇచ్చిన అనుమతుల్లో 16 రద్దు చేశారు.

స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు ఏర్పాట్లు చేయాలి

ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని పోలీస్ ప్రత్యేక పరిశీలకులు దీపక్ మిశ్రా అన్నారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల నిర్వహణ అత్యంత ప్రధానమని అన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలతో బందోబస్తు నిర్వహించాలని, 144 సెక్షన్ విధించాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలీస్ భద్రతతో ఈవీఎంలను తరలించాలన్నారు. తీవ్రవాద ప్రభావం ఉన్న జిల్లాలో ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న రక్షణ చర్యల పట్ల సంతృప్తి వ్యక్తం చేసి జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీలను అభినందించారు. సమావేశంలో ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్, సాధారణ పరిశీలకులు కమల్‌కిషోర్, హరికిషోర్, గణేష్, పోలీస్ పరిశీలకులు స్వపన్ సర్కార్, జయంత్‌సింగ్, రిటర్నింగ్ అధికారులు ప్రతీక్‌జైన్, రాంబాబు, మంగీలాల్, శిరీష, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రియాంకగాంధీ రోడ్‌షో

నేడు భద్రాద్రి జిల్లా, రేపు ఖమ్మం జిల్లాలో..

- తొలిసారి ఉమ్మడి జిల్లాకు రానున్న ప్రియాంక
- భారీగా జన సమీకరణకు పార్టీ నేతల కసరత్తు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకగాంధీ శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. అసెంబ్లీఎన్నికల బరిలో నిలిచిన పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆమె ప్రచారం చేస్తారు. తొలిసారి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రియాంకగాంధీ రానుండడంతో రోడ్‌షోలను విజయవంతం చేసేందుకు గాను నాయకులు భారీ జనసమీకరణలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే రాహుల్‌గాంధీ పినపాక నియోజకవర్గానికి సంబంధించి మణుగూరులో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌కు హాజరయ్యారు. ప్రస్తుతం ప్రియాంకగాంధీ వస్తుండటంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఆమె ప్రచారం చేయనుండగా, శనివారం ఖమ్మం జిల్లాలోని పాలేరు, ఖమ్మం, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో ప్రచారానికి హాజరవుతారు.

రెండు రోజులు ఉమ్మడి జిల్లాలోనే..
కొత్తగూడెంలో శుక్రవారం సాయంత్రం 3.25గంటల నుంచి 4.20 గంటల వరకు జరిగే సభలో ప్రియాంక పాల్గొంటారు. ఆ తర్వాత హెలీకాప్టర్‌లో ఖమ్మం చేరుకుని ఇక్కడే బస చేస్తారు. శనివారం ఉదయం 11.30 గంటలకు జెడ్పీ సెంటర్ నుంచి వైరా రోడ్, మయూరిసెంటర్, కాల్వొడ్డు, పెదతండా మీదుగా నాయుడుపేట వరకు జరిగే రోడ్డు షోలో పాల్గొంటారు. దీంతో ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల అభ్యర్థులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆమె ప్రచారం చేసినట్లవుతుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 1.05 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరుకు చేరుకుంటారు. అక్కడ 1.30నుంచి 2.30 గంటల వరకు జరిగే కార్నర్ మీటింగ్‌లో పార్టీ అభ్యర్థి మట్టా రాగమయితో కలిసి ప్రసంగిస్తారు. అనంతరం సాయంత్రం 3నుంచి 4గంటల వరకు మధిరలో భట్టి విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసే సభలో ప్రియాంక గాంధీ ప్రసంగిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బంది ఈనెల 24 నుంచి 28 వరకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ.. ఐదు నియోజకవర్గాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చని తెలిపారు. జిల్లాలో పీఓలు, ఏపీఓలకు 2,855, ఓపీఓలకు 834, పోలీస్ సిబ్బందికి 921, బెటాలియన్‌కు 268, ఇతరులకు 526, ఫారం 12డీ ద్వారా 102.. మొత్తం 5,506 పోస్టల్ బ్యాలెట్లు వచ్చాయని వివరించారు.



మాట్లాడుతున్న ప్రియాంక ఆల

701 మందికి హోం ఓటింగ్
జిల్లాలోని 766 మంది దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించగా గురువారం వరకు 701 మంది ఓట్లు వేశారని ప్రియాంక అల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 35 బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిగిలిన 65 మందికి శుక్రవారం వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

సూక్ష్మ పరిశీలకుల విధులు కీలకం



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

- అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి
- ఎన్నికల అబ్జర్వర్ల సూచన

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోలింగ్ ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల విధులు కీలకమైనవని ఎన్నికల పరిశీలకులు కమల్ కిషోర్, గణేష్, హరికిషోర్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం సూక్ష్మ పరిశీలకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలన చేసి నివేదికలు అందజేయాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు ఒకే ప్రాంతంలో రెండు కంటే ఎక్కువ కేంద్రాలున్న చోట అదనపు పరిశీలకులను నియమించనున్నట్లు తెలిపారు. దాదాపు 310 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో మహిళలకు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు, మౌలిక సౌకర్యాలు, వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పీఓలు, ఏపీఓలు, ఇతర సిబ్బంది విధులు ఎలా నిర్వర్తిస్తున్నారో పరిశీలించాలని సూచించారు. సమావేశంలో సీపీఓ శ్రీనివాసరావు, ఎల్‌బీఎం రామిరెడ్డి, మాస్టర్ ట్రైనర్లు సాయికృష్ణ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరికెంత.. ఏ పార్టీ ఎంత?!

- నియోజకవర్గాల్లో నోట్ల పంపిణీ మొదలు
- ఓ పార్టీకి మించి మరొకరు ఇచ్చేలా కసరత్తు
- తటస్థులకు ఎంత ఇవ్వాలనే అంశంలో తర్జనభర్జన
- ప్రచారం కొనసాగిస్తూనే ప్రలోభాలకు తెర

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ప్రలోభాలు మొదలయ్యాయి. అభ్యర్థులు ఒకవైపు ముమ్మర ప్రచారం చేస్తూనే ఓటుకు నోట్ల పంపకం ప్రారంభించినట్లు తెలుస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో ఈ పంపిణీ బాహాటంగానే సాగుతోంది. అయితే, ప్రత్యర్థులు ఇచ్చేవరకు వేచి చూస్తున్న అభ్యర్థులు.. తాము ఎంత ఇవ్వాలనే అంశంపై లెక్కలు వేసుకుంటున్నట్లు సమాచారం. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో తమకు తప్పక ఓటు వేస్తారనే నమ్మకం ఉన్న వారికి గురువారం తెల్లవారుజామున ఫోన్ చేసి మరీ నిద్ర లేపి డబ్బు ఇచ్చినట్లు తెలిసింది. మరోపక్క ఒకరిపై ఒకరు నిఘా వేసి డబ్బు పంపిణీని అడ్డుకోవాలని యత్నిస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

నోట్ల కట్టల వరద
నియోజకవర్గాల్లో నోట్ల కట్టల వరద పారుతున్నట్లు సమాచారం. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల తరఫున వారి ముఖ్య అనుచరులు ఈ పంపిణీ వ్యవహారాన్ని చక్కబెడుతున్నారు. ఒక ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయి.. ఎంత చొప్పున పంపిణీ చేయాలనే దానిపై లెక్కలేసి సొమ్ము తీసుకెళ్లి గుట్టుగా పంచుతున్నారు. ఓటుకు నోటు తీసుకున్న వారి నుంచి తమకే ఓటు వేయాలనే వాగ్దానం కూడా తీసుకుంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఈ వ్యవహారం బాహాటంగానే జరుగుతోంది. ఒక అభ్యర్థి తరఫున ఓ కాలనీలో.. మరో అభ్యర్థి తరఫున పక్క కాలనీలో ఈ పంపిణీ సాగుతోంది. ముందుగా ఓటు అభ్యర్థించడానికి వెళ్లినట్లుగా కొందరు వెళ్లి ఓటర్ల వివరాలు ఆరా తీసి.. ఆ కాసేపటికే మళ్లీ వెళ్లి డబ్బులు ముట్టజెబుతున్నారు. పార్టీల వారీగా ఓట్లు వేస్తారనే నమ్మకం ఉన్న వారికి పోటాపోటీగా డబ్బులు పంపిణీ చేస్తున్నా.. తటస్థులకు ఎంత ఇవ్వాలి, ఇవ్వకపోతే నష్టం ఏ మేరకు ఉంటుందనే అంశంపైనా కసరత్తు చేస్తున్నారని తెలిసింది.

ప్రత్యర్థి కన్నా ఎక్కువగా..
ఇక కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు పోటాపోటీగా పంపిణీ చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ప్రత్యర్థి ఒక్క ఓటుకు ఎంత ఇచ్చారనేది తెలియగానే అంతకు మించి ఇవ్వాలనే అంశంపై లెక్కలేసి పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఓ అభ్యర్థి ఓటుకు రూ.3 వేలు చొప్పున పంపిణీ చేస్తుంటే.. మరో అభ్యర్థి ఓటుకు రూ.4వేలు చొప్పున పంపిణీ చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు చర్చ సాగుతోంది. అలాగే, స్వతంత్ర అభ్యర్థుల తరఫున ఓటర్లు ఉంటే వారికి కూడా డబ్బు పంపిణీ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

పక్కా లెక్కలతో..
డబ్బుల పంపిణీ కార్యక్రమాన్ని ఆషామాషీగా కాకుండా పక్కాగా అమలు చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఎన్ని ఓట్లు ఉన్నాయి. గతంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయి..? ఎంత పంపిణీ చేశారు.. తమ పార్టీకి మెజార్టీ వచ్చిన గ్రామాలెన్ని అనే దానిపై ఇప్పటికే లెక్కలు తీశారు. అలాగే తమ పార్టీకి మెజార్టీ వచ్చిన గ్రామాల్లో ఎంత డబ్బు పంపిణీ చేయాలి, పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఎంత పంపిణీ చేయాలనే దానిపై అభ్యర్థులు కసరత్తు పూర్తి చేయించి పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అలాగే బలహీనంగా ఉన్న అభ్యర్థి ఎంత పంపిణీ చేస్తున్నాడు. స్వతంత్ర అభ్యర్థుల పరిస్థితి ఏమిటనే దానిపై బేరీజు వేసే పనిలో ఉన్నారు. నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లలో 70 నుంచి 80 శాతం మంది ఓటర్లకు నగదు పంపిణీ చేయాలని కొంతమంది అభ్యర్థులు నిర్ణయించుకుని ఆ దిశగా తమ కేడర్‌ను పంపిణీ బాట పట్టించారు. తమకు ఓట్లు పోల్ కావని భావించిన ప్రాంతాల్లో మాత్రం కొంతమందికే పంపిణీ చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

ప్రత్యర్థులపై ప్రత్యేక దృష్టి
మరోవైపు కొందరు అభ్యర్థులు ప్రత్యర్థుల కదలికలపై నిఘా పెట్టారు. ఎక్కడెక్కడ పంపిణీ చేస్తున్నారు, ఎంత నగదు పంపిణీ చేస్తున్నారనే అంశంపై ఆరా తీస్తున్నారు. పోలింగ్‌కు ఇంకా ఆరు రోజుల సమయమే ఉండడంతో ఇప్పటి వరకు ప్రచారంపైనే దృష్టి సారించిన చేసిన అభ్యర్థులు ఇప్పుడు డబ్బు పంపిణీ మొదలుపెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారం చేస్తూనే డబ్బు పంపిణీని కూడా పర్యవేక్షిస్తున్నారు. అయితే కార్యకర్తలు, నాయకులు ప్రత్యర్థులు ఎక్కడెక్కడ పంపిణీ చేస్తున్నారనే దానిపై ఓ కన్నేసి ఏదైనా సమాచారం తెలియగానే అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిసింది. కాగా, జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో గురువారం తెల్లవారుజాము నుంచే పంపిణీ మొదలై రాత్రికల్లా జోరందుకుందని సమాచారం.

తగ్గేదే లే..
ఇప్పటి వరకు పార్టీల సర్వేలు, అభ్యర్థులు చేయించుకున్న సర్వేల నివేదికలు చూసుకుని ఎక్కడ తాము బలహీనంగా ఉన్నామో అక్కడే ప్రధానంగా అభ్యర్థులు ప్రచారంపై దృష్టి పెట్టారు. పట్టణ, మండల కేంద్రాల్లో ఏ మాత్రం ఓట్లు తమకు తగ్గకుండా ప్రణాళిక రూపొందించుకుని ఓటుకు నోటు పంపిణీ మొదలుపెట్టారు. కనుచూపు మేరల్లో విజయం కనిపిస్తున్నా.. ఏ మాత్రం తప్పటడుగు వేసినా ఓటమి తప్పదనే భయంతో నోట్ల పంపిణీ సమయాన ప్రత్యర్థి ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ముందుకు సాగుతున్నారు.

‘కారు’ కౌగిట్లో కత్తులు!

- పొమ్మనలేక పొగబెడుతున్న వైనం ?
- ప్రచారానికి దూరంగా నాయకులు, కార్యకర్తలు
- పరస్పరం నమ్మకాలు లేని పరిస్థితి
- ‘పేట’ బీఆర్‌ఎస్‌లో విభిన్న రాజకీయం



అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీలో కౌగిలించుకుని కత్తులు దూసుకుంటున్న చందంగా పరిస్థితులు తయారయ్యాయి. అభ్యర్థిని పరిశీలకులు.. నాయకులను అభ్యర్థి.. కార్యకర్తలను నాయకులు.. చివరకు పార్టీని ఓటర్లు నమ్మలేని పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. ఎన్నికల వాతావరణం ప్రారంభమైనప్పటి నుంచీ మెచ్చా శిబిరం అంతర్గత కుమ్ములాటలతోనే ఉన్నట్లు తెలుస్తోంది. ‘మీతో నాకు అవసరం లేదు.. ఓటర్లు నా వైపున ఉన్నారు.. ఇక మీరు సెలవు తీసుకోవచ్చు’ అని స్వయంగా పార్టీ అభ్యర్థి కొందరు సీనియర్లతో అన్నట్లు తెలిసింది. దశాబ్దాల రాజకీయ చరిత్రలో జలగం వెంగళరావు, జలగం ప్రసాదరావు, తుమ్మల నాగేశ్వరరావు, జలగం వెంకటరావు, వగ్గెల మిత్రసేన, తాటి వెంకటేశ్వర్లు వంటి వారిని ఎమ్మెల్యేలుగా గెలిపించడంలో తమ వంతు పాత్ర, రాజకీయ చతురత పోషించిన రాజకీయ దురంధురలను సైతం మెచ్చా పూచిక పుల్లలా తీసేసినట్లు వ్యవహరించడాన్ని పలువురు జీర్ణించుకోలేకపోతున్నారు. తనతోపాటు పార్టీ మారిన ఆ నలుగురి కోటరీనే నమ్ముకుని, వారే సర్వస్వమనుకునే వైఖరిని పార్టీ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది.

మిన్నకుంటున్న నాయకులు..
తమకు ప్రాధాన్యం లేని చోట ఉండలేక.. నమ్ముకుని అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌ను వీడలేక.. ఆరు పదుల వయసులో పార్టీ మారామన్న అపవాదు మూటగట్టుకోలేక.. ఎన్నో అవమానాలను సైతం భరిస్తూ పలువురు నాయకులు మిన్నకుండి పోతున్నారు. కొందరికైతే ప్రచార సమాచారం కూడా లేకపోవడంతో ఇళ్లకే పరిమితం అవుతున్నారు. కేడర్‌కు ఏం చెప్పాలో తెలియక పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయండని సూచిస్తున్నారు. అయితే కనీసం ఎన్నికల ప్రచార అవసరాలు తీర్చేందుకు పార్టీ నుంచి ఎవరూ ముందుకు రాకపోవడంతో కేడర్‌లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పరస్పరం నమ్మకం లేదాయె..
ఉమ్మడి జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల్లో కంటే అశ్వారావుపేటలో పరిస్థితి విభిన్నంగా తయారైంది. అభ్యర్థి చుట్టూ రాబందుల వలయం ఉన్నట్లు పార్టీ పెద్దలు అనుమానిస్తున్నారనే ప్రచారం మొదటి నుంచీ జరుగుతోంది. దమ్మపేట మండలం మల్లారంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్ల దగ్గర ఇదంతా బట్టబయలైంది. మండల స్థాయి నాయకులను నియోజకవర్గ నాయకుడు నమ్మకపోగా.. ‘ నా దగ్గరకు మీరెందుకొచ్చారు.. మీ పని మీరు చేసుకోండి.. మీకు మీ ఊర్లో మంచి పేరు లేదు.. మీరు తిరగొద్దు..’ అని అనడంతో వారు దిగ్భ్రాంతికి లోనయ్యారని తెలుస్తోంది. అభ్యర్థి కంటే అతడి చుట్టూ ఉన్న వారి పెత్తనం తమను తికమక పెడుతోందని, ఏదైనా సలహా ఇద్దామన్నా తమను నమ్మడం లేదని కొందరు సీనియర్లు వాపోతున్నారు. ఇన్ని అవమానాలు, అపనమ్మకాలు ఎదురవుతున్నా.. తుమ్మల నాగేశ్వరరావు ప్రధాన అనుచరులు ఇద్దరు ఇంకా ‘కారు’ దిగడం లేదని, కాంట్రాక్టు బిల్లుల కోసమే వారు బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబమే దోచుకుంది..

- తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోంది
- నిజాయితీపరుడైన పొదెం వీరయ్యను గెలిపించాలి
- ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మంత్రి కవాసి లక్మా

భద్రాచలం: ఎందరో అమరుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ కుటుంబమే దోచుకుందని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మంత్రి కవాసి లక్మా అన్నారు. గురువారం ఆయన స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావు, సంతోష్.. ఇలా అందరూ పదవులు అనుభవిస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. తెలంగాణ సాధనలో ముఖ్య పాత్ర పోషించిన నిరుద్యోగులకు ఉపాధి లేదని, ఉద్యోగాల నోటిఫికేషన్‌ల మాటే లేదని ఆరోపించారు. ప్రజా సంక్షేమాన్ని మరిచిన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాల్సిన రోజు వచ్చిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి భద్రాచలాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, ఇప్పుడు బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే అభివృద్ధి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. భద్రాద్రి రామయ్యను విస్మరించిన ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. అధికార పార్టీ ప్రలోభపెట్టినా, పదవులకు, డబ్బులకు ఆశపడకుండా నిజాయితీగా ఉన్న పొదెం వీరయ్యను గెలిపించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో వీరయ్య మంత్రి అయి భద్రాచలాన్ని అభివృద్ధి చేస్తారని చెప్పారు. అనంతరం పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, నాయకులు భోగాల శ్రీనివాసరెడ్డి, అడబాల వెంకటేశ్వరరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బలుసు నాగ సతీష్, తుమ్మల వెంకటేశ్వర్లు, సరెళ్ల వెంకటేష్, రాగం సుధాకర్, టీడీపీ నాయకులు కొడాలి శ్రీనివాస్, అబ్బినేని శ్రీను, కుంచాల రాజారాం, ఎస్‌కే.అజీమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కవాసి లక్మా

చిన్నా పెద్ద.. అందరికీ రక్ష



ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ నగరంలోని శ్రీనగర్ కాలనీలో రోడ్డు షోతో పాటు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఓ ఇంటికి వెళ్లగా చంటిబిడ్డతో బాలింత ఎదురైంది. దీంతో చిన్నారిని చేతుల్లోకి తీసుకుని లాలించిన పువ్వాడ.. చిన్నారులు మొదలు వృద్ధుల వరకు అందరికీ అండగా నిలుస్తున్న తనను మరోమారు గెలిపించాలని కోరారు. - ఖమ్మం అర్బన్

గాలివాన మమ్మల్ని అడ్డుకోలేవు...





ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులు గాలి, వానను కూడా లెక్క చేయడం లేదు. సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గురువారం ఎంపీ పార్థసారధిరెడ్డితో కలిసి వేంసూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మధ్యలో వర్షం వచ్చినా వారు ప్రచారం ఆపకుండా గొడుగుల సాయంతో ప్రసంగించారు. ఇక పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి తిరుమలాయపాలెం మండలంలో ఎన్నికల ప్రచారంచేశారు. అయితే, తిరుమలాయపాలెం, పిండిప్రోలు గ్రామాల్లో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వారు ముందుకు సాగారు. - వేంసూరు/తిరుమలాయపాలెం

ఎక్కడ ఉన్నా వదిలేది లేదు..



ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీ అభ్యర్థులు, నాయకులు దొరికే ఏ అవకాశాన్నీ వదలడం లేదు. గ్రామాల్లోకి ప్రచారానికి వెళ్తే వ్యవసాయ పనుల కారణంగా కూలీలు ఉండడం లేదు. దీంతో కొన్ని పార్టీల కార్యకర్తలు పొలాల వద్దకే వెళ్లి ప్రచారం చేస్తున్నారు. పాల్వంచ మండలంలోని సూరారం సమీపాన పత్తి చేనులో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రచారం చేస్తున్న దృశ్యమే ఇది. - పాల్వంచ

క్లుప్తంగా

మహిళా న్యాయమూర్తి మృతికి సంతాపం

కొత్తగూడెంటౌన్: సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి జస్టిస్ ఫాతిమాబీవీ మృతిపట్ల గురువారం కొత్తగూడెం బార్ అసోసియేషన్ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ మాట్లాడుతూ మున్సిఫ్ జడ్జి నుంచి సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన ఆమె జీవితం అందరికీ ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నలుగురిపై పిచ్చికుక్క దాడి

గుండాల: పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ నలుగురిని కాటేసిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఆళ్లపల్లి మండలంలోని మర్కోడు పంచాయతీ కేంద్రంలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ నలుగురు స్థానికులను తీవ్రంగా గాయపరిచింది. బాధితులను ఆళ్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని సింగవరం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 30 లీటర్ల నాటుసారాను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సింగవరం గ్రామ శివారులో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో నాటుసారా తీసుకెళ్తున్న ఏపీలోని ఎటపాక మండలం గుండువారిగూడేనికి చెందిన భూక్యా సురేష్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అతని ద్విచక్రవాహనం సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐలు కేశవరావు, గణేష్ తెలిపారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

ములకలపల్లి: గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రింగిరెడ్డిపల్లి శివారులో కోడిపందేలు నిర్వహిస్తుండగా దాడులు నిర్వహించారు. ఐదుగురు పందెంరాయుళ్లను అరెస్ట్ చేశారు. రూ.2,050 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీకొత్తూరు గ్రామ సమీపంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మల్లెలమడుగు గ్రామానికి చెందిన మీసేవ కేంద్రం నిర్వాహకుడు వెలమ రాజేందర్ బైక్‌పై అశ్వాపురం నుంచి మొండికుంట వస్తుండగా మరో బైక్ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలు కాగా, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు కందుల కృష్ణార్జున్‌రావు తన వాహనంలో భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. రాజేందర్ సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో రాజేందర్‌ను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి, జాలె రామకృష్ణారెడ్డి, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

టేకులపల్లి: పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. టేకులపల్లి ఎస్‌ఐ జి.రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని తొమ్మిదోమైలుతండాకు చెందిన గుగులోత్ నవీన్(25) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18న రాత్రి మద్యం తాగి ఇంటికి రాగా, భార్య ప్రశ్నించడంతో గొడవ జరిగింది. దీంతో నవీన్ మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌లో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లింది. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా మృతుడికి భార్య కల్యాణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

చాలెంజ్.. టెండర్

- ఓటింగ్‌కు అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం
- నకిలీ ఓటరని ఏజెంట్ సందేహించినప్పుడు..
- తన ఓటు మరొకరు వేశారని ఓటరు గుర్తించినప్పుడు..

సుజాతనగర్: సాధారణంగా ఓటింగ్ ప్రక్రియలో పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయడం, మరొకటి పోస్టల్ బ్యాలెట్ ఉంటాయి. అయితే చాలెంజ్ ఓటు, టెండరు ఓటు కూడా ఉంటాయని ఎక్కువ మందికి తెలియదు. నకిలీ ఓటరని పోలింగ్ ఏజెంట్ భావించినప్పుడు, తన ఓటు మరో వ్యక్తి వేశాడని ఓటరు గుర్తించి, డిమాండ్ చేసినప్పుడు ఈ ఓట్లకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పిస్తారు.

చాలెంజ్ ఓటు..

పోలింగ్ కేంద్రంలో అధికారులతో పాటు ఆయా పార్టీలు నియమించుకున్న పోలింగ్ ఏజెంట్లు ఉంటారు. ఒక ఓటరు ఓటు వేయటానికి వచ్చినపుడు సదరు ఓటరు నకిలీ అని ఏజెంట్ సందేహిస్తే.. పోలింగ్ ఏజెంట్ చాలెంజ్ చేయటానికి వీలు కల్పించారు. ఓటరు సరైన వ్యక్తి కాదని ప్రిసైడింగ్ అధికారితో చాలెంజ్ చేసి రూ.5 రుసుం చెల్లించి సదరు ఓటును చాలెంజ్ చేస్తాడు. దీంతో ప్రిసైడింగ్ అధికారి ఓటరుకు సంబంధించిన పత్రాలు అన్ని పరిశీలించి నిర్ధారణ చేసుకుని సరైన ఓటరుగా నిరూపణ అయితే ఓటు వేయటానికి అవకాశం కల్పిస్తారు. లేదంటే వెనక్కి పంపిస్తారు. కాగా గతంలో కొన్ని సందర్భాల్లో ఓటరుకు బ్యాలెట్ అందించి, ఓటు వేయించి కవర్లో ఉంచి సీల్ చేస్తారు. ఓటరు సక్రమం అని తేలితే కౌంటింగ్ సమయంలో కవర్ ఓపెన్ చేసి దానిని లెక్కించేవారు.



టెండరు ఓటు

ఎవరైనా ఓటరు తన ఓటును ముందే వేశారని గుర్తిస్తే అలాంటి సమయంలో ఎన్నికల కమిషన్ టెండరు ఓటుకు అవకాశం కల్పిస్తుంది. పోలింగ్ రోజున ఓటరు తన ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి చేరుకున్నప్పటికీ అప్పటికే మరెవరో తన ఓటు వేశారని గుర్తిస్తే టెండరు ఓటు వేస్తానని అధికారులను కోరవచ్చు. తన స్థానంలో ఇంకెవరో ఓటు వేశారని ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి. అప్పుడు ఆ అధికారి విచారణ జరిపి గుర్తింపును నిర్ధారిస్తారు. అయినప్పటికీ ఓటు వేయటానికి అవకాశం కల్పించకుండా ఉంటే టెండరు ఓటు వేస్తానని ఓటరు డిమాండ్ చేయవచ్చు. రూ.2 రుసుము చెల్లించి టెండరు ఓటు వేసుకోవచ్చు. టెండరు ఓటు సైతం బ్యాలెట్ ద్వారానే వేసుకోవాల్సి ఉంటుంది. ఓటరు వేసిన టెండరు ఓటును సీల్డ్ కవర్లో ఉంచుతారు. ఇలా చాలెంజ్, టెండరు ఓట్లను ఓటరు వినియోగించుకునే వెసులుబాటు ఎన్నికల కమిషన్ కల్పించింది. కాగా ఎన్నికల్లో చాలెంజ్, టెండరు ఓట్లు వినియోగించుకున్న సందర్భాలు మన ప్రాంతంలో లేవనే చెప్పాలి.

జంగ్ తెలంగాణ

పోలింగ్ ఏజెంట్ విధులివే..

వైరా: పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికల సిబ్బందితో పాటు అభ్యర్థులు, ఏజెంట్లకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఏజెంట్ లోపలకు, బయటకు వెళ్లాలన్నా ప్రిసైడింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. ఏజెంట్ పోలింగ్ ప్రారంభానికి కనీసం అరగంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి. ఓట్లు వేయడానికి వచ్చిన ఓటర్లను ఏజెంట్లు గుర్తించాలి. దొంగ ఓట్లు వేసేవారిని గుర్తించి ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి. ఎన్నికలు ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులకు సీల్‌వేసి భద్రపరిచే సమయంలో ఎన్నికల అధికారికి సహకరించాలి.

లక్ష్మణ రేఖ..

పోలింగ్ కేంద్రాల వద్ద వందమీటర్ల దూరంలో సరిహద్దు గీతను గీస్తారు. దీని పరిధిలో పార్టీల రంగులు, జెండాలు ఉండరాదు. ఓటర్లు గుంపుగా రాకూడదు. ఏ పార్టీ వారైనా ఓటర్లను వాహనాల్లో పెద్ద సంఖ్యలో ఇక్కడివరకు తీసుకురాకూడదు. హద్దులోపల అభ్యర్థులు ఎటువంటి పార్టీగుర్తులు, బ్యాడ్జీలు ధరించి ప్రచారం చేయొద్దు. ఈ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటారు.

నగదు స్వాధీనం

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలు పరిధిలో గురువారం తెల్లవారుజామున పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.24.05లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కారులో నగదు తీసుకెళ్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

రూ.24లక్షలు..

ఖమ్మంరూరల్: మండలంలోని ఎం.వెంకటాయపాలెంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలో తీసుకెళ్తున్న రూ.24లక్షల నగదు ను గురువారం రాత్రి పోలీసులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారంతో ఆ వ్యక్తిని గుర్తించి నగదుసీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.అదే విధంగా సప్తగిరినగర్‌లోని ఇద్దరి ఇళ్లలో అధికా రులు తనిఖీ చేసినా, ఎలాంటి నగదు లభించలేదు.

పవన్‌కళ్యాణ్ వాహనం తనిఖీ

కొత్తగూడెంటౌన్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి గురువారం కొత్తగూడెం వచ్చిన జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ వాహనాన్ని ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడెం నుంచి జనసేన తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న లక్కినేని సురేందర్‌రావుకు మద్దతుగా బీజేపీ నాయకులతో కలిసి సభలో పాల్గొనేందుకు ఆయన కొత్తగూడెం చేరుకున్నారు. విజయవాడ నుంచి కొత్తగూడేనికి రోడ్డు మార్గంలో వచ్చారు. కాన్వాయ్ వస్తున్న క్రమంలో ఎన్నికల అధికారులు రామవరం గోధమ వాగు వద్ద ఆపి పవన్‌కళ్యాణ్ కారును తనిఖీ చేశారు. కారులో ఉన్న పర్సనల్ థింగ్స్‌ను కూడా పరిశీలించారు. తనిఖీల సమయంలో అదే కారులో పవన్‌కళ్యాణ్‌తోపాటు జనసేన ముఖ్య నేత నాదెండ్ల మనోహర్ సైతం ఉన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ హెడ్ పి.రాకేష్, అధికారులు, సిబ్బంది ఎస్తార్, సంపత్, రవి, రమణ, బాలు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పవన్‌కళ్యాణ్ కారులో తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు

ముత్తగూడెంలో..

పెనుబల్లి : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కారును గురువారం మండల పరిధిలోని ముత్తగూడెం చెక్ పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుంచి కొత్తగూడెం, వైరా నియోజకవర్గాల్లో ప్రచారానికి వెళ్తుండగా పోలీసులు ఆయన వాహనాన్ని ఆపి పరిశీలించారు.

చెల్లని ఓట్లు.. ఇక గతమే!



కరకగూడెం: ఓటింగ్ ప్రక్రియలో ఈవీఎం యంత్రాలు ప్రవేశపెట్టాక చెల్లని ఓట్లు లేకుండా పోయాయి. ఓటరు తాను ఓటు వేసే అభ్యర్థి గుర్తు పక్కనున్న మీటను నొక్కాలి. అభ్యర్థులు నచ్చకపోతే 'నోటా' నొక్కే సౌకర్యం ఉంది. గతంలో జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కుకు ఉపయోగించే బ్యాలెట్ పేపర్లపై స్వస్తిక్ ముద్రణ ఉండేది. ఓటు వేసే సమయంలో అభ్యర్థి గుర్తుపై ముద్ర సరిగా పడక పోవడం, ముద్ర ఇద్దరు అభ్యర్థుల గుర్తులపై పడటం, ముద్ర వేయకుండానే బాక్స్‌లో బ్యాలెట్ పేపర్ వేయడం వంటి సంఘటనలో చోటుచేసుకునేవి. ఇలా జరిగిన వాటిని చెల్లని ఓట్లుగా పరిగణించేవారు. అయితే ఈవీఎంల రాకతో చెల్లని ఓట్లు అనే పరిస్థితే లేకుండాపోయింది.

బైండోవర్ అంటే..

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల సీజన్‌లో తరచూ 'బైండోవర్' అనే పదం వినిపిస్తుంది. పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేస్తూ ఉంటారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీ షీటర్లు, నేరాలు, అక్రమంగా మద్యం, సారా, గంజాయి విక్రయాలు చేసే వారే కాకుండా ఎలాంటి నేరం చేయకపోయినా, అనుమానాస్పద వ్యక్తులపై కూడా పోలీస్ శాఖకు బైండోవర్ కేసులు నమోదు చేసే అధికారం ఉంటుంది. ఈ కేసుల్లో అరెస్టు చేసిన వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తారు(బైండోవర్ చేస్తారు). బైండోవర్ చేసిన వ్యక్తి తరఫు వారి నుంచి పూచీకత్తు తీసుకుని బాండ్ పేపర్‌పై రాయించుకొని ఆ తర్వాత విడుదల చేస్తారు. ఒకసారి బైండోవర్ అయినా వ్యక్తి ఆరు నెలలలోపు చట్ట వ్యతిరేక చర్యలు, అల్లర్లు, ఘర్షణలకు పాల్పడినా, ప్రవర్తనలో మార్పు రాకపోయినా కేసు నమోదు చేసి రూ.లక్ష వరకు జరిమానా, ఒక్కోసారి జైలు శిక్ష సైతం విధిస్తారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

పినపాక రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్



ఎన్నికల విధులపై వివరిస్తున్న రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్

మణుగూరు రూరల్ : శాసనసభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని పినపాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. గురువారం మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంల ర్యాండమైజేషన్‌పై పీఓలు, ఏపీఓలకు రెండో విడత శిక్షణ నిర్వహించారు. శిక్షణ తరగతులను సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఈవీఎంల పనితీరు, ఎన్నికల ఫ్రొఫార్మలను పూరించే తీరుపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పినపాక, ఇల్లెందు, భద్రాచలం, కొత్తగూడెం నియోజకవర్గాల ఎన్నికల సిబ్బంది కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలినవారు 29న ఈవీఎం యంత్రాల పంపిణీ సందర్భంగా వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకున్నాకే విధులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి, ఎలక్షన్ డీటీలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో అన్నాతమ్ముళ్ల నడుమ ఘర్షణ

వైరారూరల్: మండలంలోని విప్పలమడకలో భూవివాదానికి సంబంధించి అన్నాతమ్ముళ్ల నడుమ ఘర్షణ జరగగా.. తమ్ముడి దాడిలో ఆయన అన్నావదిన గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు కథనం మేరకు.. విప్పలమడకకు చెందిన సోదరులు వాకదాని బాబురావు, శ్రీనివాసరావుకు వారసత్వంగా వచ్చిన 500 గజాల ఇంటి స్థలం ఉంది. ఇందులోని 250 గజాల స్థలంలో బాబురావు ఇల్లు నిర్మించుకోగా, శ్రీనివాసరావుకు చెందిన స్థలంపై వివాదం నెలకొంది. ఈక్రమంలో గురువారం శ్రీనివాసరావు తన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సహకరించాలని బాబురావును కోరగా ఆయన నిరాకరించాడు. దీంతో వాగ్వాదం చోటు చేసుకకోగా, శ్రీనివాసరావు తన అన్న బాబురావు, వదిన నాగమణిపై కర్రతో దాడి చేయగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఘటనపైపోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పుడు ప్రచారం నమ్మొద్దు: డీఎస్పీ



కొత్తగూడెంటౌన్: సోషల్ మీడియాలో మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టినా, తప్పుడు ప్రచారం చేసినా కఠిన చర్యలు తప్పవని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగూడెంలో ఎన్నికల సమయంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా కొందరు లెటర్ తయారు చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని తెలిపారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సోషల్ మీడియాలో తిరుగుతున్న తప్పుడు పోస్టింగ్ విషయమై ఇప్పటికే చుంచుపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

వేంసూరు: ద్విచక్ర వాహనాన్ని కంకర్ రవాణా చేసే లారీ ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వేంసూరు మండలం మొద్దులగూడెం శివారులో గురువారం ఈ ప్రమాదం జరిగింది. అడసర్లపాడు గ్రామానికి చెందిన పాలగాని పుల్లయ్య, అట్లూరి సుబ్బారెడ్డి మొద్దులగూడెం నుంచి స్కూటీపై మర్లపాడు వైపు నుంచి తిరువూరు వైపు వెళ్తున్నారు. ఈక్రమాన వెనుక నుంచి వచ్చిన కంకర్ లారీ వీరి వాహనాన్ని దాటే క్రమాన ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు తరలించగా పాలగాని పుల్లయ్య(60) చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే, అట్లూరి సుబ్బారెడ్డి చికిత్స పొందుతున్నాడు. అయితే, ప్రమాదానికి కారణమైన లారీని డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు.

మరో ప్రమాదంలో..

బోనకల్: మండలంలోని జానకీపురం–రావినూతల గ్రామాల మధ్య బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బందం రాంచంద్రయ్య(43) మధిరలోని సీసీఐ కేంద్రానికి టాటా ఏస్ వాహనంలో పత్తి తీసుకెళ్లి తిరిగి వస్తున్నాడు. వైరా నుండి బోనకల్ వైపు వస్తున్న ట్రాక్టర్‌ను ఆయన వెనక నుండి ఢీకొని రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన రాంచంద్రయ్యను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాయికుమార్ తెలిపారు.



రాంచంద్రయ్య (ఫైల్)

కాలినడకన భద్రగిరికి...



పాదయాత్రగా భద్రాచలం వెళ్తున్న భక్తులు

ములకలపల్లి: ములకలపల్లికి చెందిన భక్తులు కాలినడకన భద్రగిరికి పయనమయ్యారు. సుమారు వంద మంది మహిళలు శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం సుమారు యాభై కిలోమీటర్లు నడిచి భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కారేపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తిని తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కారేపల్లి మండలం దుబ్బతండాకు చెందిన మూడ్ శివ(30) ఇటీవల మద్యానికి బానిసై ఏ పనీ చేయకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అయినా ఆయన తీరు మారకపోవడంతో తల్లిదండ్రులు మందలించగా, బుధవారం రాత్రి మద్యం మత్తులోనే పురుగుల మందు తాగాడు. గ్రామ శివార్లలో అపస్మారకస్థితిలో పడిపోయిన శివను శివను గుర్తించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో కుటుంబీకుల ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై ఆయన తండ్రి భీముడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రామారావు తెలిపారు.

ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నేలకొండపల్లి మండలం పైనంపల్లికి చెందిన మహిళకు ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఖమ్మం అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె.ఆశారాణి గురువారం తీర్పు చెప్పారు. పైనంపల్లికి చెందిన గోసుల వీరబాబుకు 2012లో విమలతో వివాహమైంది. అయితే, వీరబాబు తల్లి గోసుల అంజమ్మతో విమల తరుచూ గొడవ పడుతుండేది. పెద్దమనుషుల సమక్షాన పంచాయితీ నిర్వహించినా కొన్నాళ్లు బాగానే ఉండి మళ్లీ గొడవ పడేది. దీంతో మనస్తాపం చెందిన అంజమ్మ 2016 డిసెంబర్ 3న ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. ఈమేరకు మంటలు ఆర్పి ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా అదే నెల 10న మృతిచెందింది. ఘటనపై కేసు నమోదు చేసిన నేలకొండపల్లి పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో భాగంగా విమలపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఇదే కేసులో రెండో ముద్దాయిపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.డీ.ఇర్షాద్ వాదించగా, ఎల్.భద్రునాయక్, ఓ.శ్రీనివాసరావు సహకరించారు.

ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, లారీ

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఘటనాస్థలంలో బస్సు, లారీ

వైరారూరల్: వైరా మండలంలోని తాటిపూడిలో ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... మధిర డిపోకు చెందిన బస్సు మధిర నుండి ఖమ్మం వెళ్తుండగా, ఏపీలోని విశాఖపట్నం నుండి జగ్గయ్యపేట వెళ్తున్న లారీ తాటిపూడి లోని రామాలయం సమీపం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో లారీ డ్రైవర్, బస్సులోని ఇద్దరు మహిళలు స్వల్పంగా గాయపడ్డారు. బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉండగా, త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఎస్సై మేడా ప్రసాద్, కానిస్టేబుల్ భూక్యా బాలన్యానాయక్ చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గంజాయి సీజ్

నవభారత్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ అధికారుల కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మహబూబాబాద్‌కు చెందిన శ్రీరామ్ నాయక్, నరేష్ అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశాలోని మోటు ప్రాంతం నుంచి 3.5 కేజీల ఎండు గంజాయి కొనుగోలు చేసి కొత్తగూడెం మీదుగా మహబూబాబాద్ తీసుకెళ్తున్నట్లు తేలింది. ఇద్దరుని అరెస్ట్ చేసి, గంజాయిని, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ తనిఖీల్లో అధికారులు కరంచంద్, జయశ్రీ, గౌతమ్, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితులు, గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ ఖమ్మం పట్టణం సమీపంలో DTCP, SUDA, Rera అన్ని అనుమతులతో కూడిన ప్లాట్స్ తక్కువ ధరలలో కలవు. భారతి రియల్ ఎస్టేట్స్ అండ్ డెవలపర్స్. సంప్ర. 91775 54110, 94401 01408. [M-2791]

Wanted

■ శ్రీశ్రీశ్రీ హీరో షోరూం నేలకొండపల్లి నందు పనిచేయుటకు వర్కర్స్, మెకానిక్స్, సూపర్ వైజర్స్, స్పేర్‌పార్ట్స్ ఇంచార్జి, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి కావలెను. 9398394032. [M-1221924]

■ ఖమ్మం కరుణగిరి శ్రీ విద్యానికేతన్ స్కూల్ నందు బోధించుటకు ప్రీ ప్రైమరీ టీచర్స్ కావలెను. (Fluency in English must) మంచి వేతనం. సంప్ర:: 8125560009, 9391325192. [M-1221879]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221874]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర: 9177736926 [G-824725]

■ వర్క్ ఫ్రం హోమ్ : తెలుగు రాష్ట్రాలలో ఉన్న నెం. 1 కంపెనీలలో ఈ కంపెనీ ఒకటి. టీమ్ వర్క్ చేయటానికి M/F కావలెను. కేవలం 40 మందికి మాత్రమే అవకాశంవుంది. అర్హత : 10th, ఇంటర్, డిగ్రీ, Age : 18+, మీ Details Send చేయండి. Whatsapp-96180 29787. [M-1221921]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9705444182
	9010299957
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642

క్లుప్తంగా...

నేడు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమల: భక్తుల సౌకర్యార్థం 2024 ఫిబ్రవరి నెలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను శుక్రవారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదేవిధంగా తిరుమల, తిరుపతిలోని గదుల కోటాను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు www.tirumala.org వెబ్‌సైట్‌లో ముందస్తుగా దర్శన టికెట్లు, గదులను బుక్ చేసుకోవాలని టీటీడీ కోరింది.

27న శ్రీవారి సేవ కోటా విడుదల:
2024 ఫిబ్రవరి 16న రథసప్తమి పర్వదినానికి సంబంధించిన శ్రీవారి సేవ స్లాట్లను ఈ నెల 27న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 18 నుంచి 50 ఏళ్ల వరకు వయోపరిమితి ఉన్నవారు మాత్రమే ఈ స్లాట్లను బుక్ చేసుకునేందుకు అర్హులు. తిరుమల, తిరుపతిలో భక్తులకు స్వచ్ఛంద సేవ చేసేందుకు గాను 2024 జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన శ్రీవారి సేవ, నవనీత సేవ కోటాను అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేస్తారు. ఈ సేవలను www.tirumala.org వెబ్‌సైట్‌లో భక్తులు బుక్ చేసుకోవచ్చు. కాగా, తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 27న పరిపాలన కారణాల వల్ల బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

ఇన్‌స్పెక్టర్ సభావేదిక ఎక్కలేదు

- అక్బరుద్దీన్ ఆరోపణలు అవాస్తవం
- సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రోహిత్‌రాజు

సంతోష్‌నగర్: మజ్లిస్ బహిరంగ సభలో సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శివచంద్ర సభావేదిక ఎక్కినట్లు ఎలాంటి ఆధారాలు లేవని, ఆయనపై చాంద్రాయణగుట్ట మజ్లిస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ చేసిన ఆరోపణలు నిజం కాదని దర్యాప్తులో తేలిందని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రోహిత్ రాజు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్బరుద్దీన్ ఈ నెల 21న సంతోష్‌నగర్‌లోని ఈదిబజార్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఇన్‌స్పెక్టర్ శివచంద్రను అడ్డుకోవడంతోపాటు తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారన్నారు. అక్బరుద్దీన్ చేసిన ఆరోపణలపై పోలీసు, ఎఫ్ఎస్‌టీ, మీడియా చానళ్లు, ఎస్‌బీ రిసోర్స్ సెంటర్, స్మార్ట్ మీడియా ఇన్వెస్టిగేషన్ టీమ్, సీపీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను పరిశీలించగా ఇన్‌స్పెక్టర్ డయాస్ ఎక్కినట్లు ఎలాంటి ఆధారాలూ లభించలేదన్నారు. సభలో ద్వేషపూరిత ప్రసంగం చేసి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఆయన ఉల్లంఘించారని పేర్కొన్నారు.

విశాఖ నుంచి పాలనకు కీలక అడుగు

విశాఖ మిలీనియం టవర్లలో మంత్రులు, సీనియర్ అధికారుల క్యాంపు కార్యాలయాలు

- ఏ, బీ టవర్లలో 1.75 లక్షల చదరపు అడుగుల వసతి
- సీఎం, మంత్రులు, సమీక్షలకు ఈ టవర్లను వినియోగించుకోవాలి
- 16 శాఖలకు వివిధ ప్రాంతాల్లో భవనాలు కేటాయింపు


విశాఖ బీచ్ రోడ్డు

సాక్షి, అమరావతి: విశాఖపట్నం నుంచి పరిపాలనకు కీలక అడుగు పడింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో సమతుల అభివృద్ధిలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సమీక్షలు, పర్యవేక్షణ చేయాల్సి ఉన్నందున ముఖ్యమంత్రి, మంత్రులు, సీనియర్ అధికారులు ఆ జిల్లాల్లో పర్యటించడంతో పాటు విశాఖపట్నంలో రాత్రి పూట బస చేయాల్సి ఉందని, ఈ నేపథ్యంలో మంత్రులు, సచివాలయాల శాఖలు, సీనియర్ అధికారులకు కార్యాలయాల వసతిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖలో మంత్రులు, సచివాలయ, వివిధ శాఖాధిపతుల కార్యాలయాలు, క్యాంపు కార్యాలయాలకు భవనాలను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో కమిటీని నియమించింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు మంత్రులు, సచివాలయ శాఖల కార్యాలయాల వసతికి ప్రభుత్వ భవనాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రులు, సీనియర్ అధికారుల సమీక్ష సమావేశాలకు రుషికొండలోని మిలీనియం టవర్స్ ఏ, బీని క్యాంపు కార్యాలయాలుగా గుర్తించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సొంత భవనాల్లేని ప్రధాన శాఖలకు కూడా ఈ టవర్లలో వసతి కేటాయించనున్నట్లు తెలిపారు. ఇక్కడ 1.75 లక్షల చదరపు అడుగుల స్థలంలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మిగతా శాఖలకు నగరంలోని వివిధ ప్రభుత్వ భవనాల్లో మొత్తం 2.27 లక్షల చదరపు అడుగులు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తం 35 శాఖల్లో 16 శాఖలకు మాత్రమే ప్రస్తుతానికి విశాఖలో వసతి కేటాయించారు. వీటికి ఎండాడ, హనుమంతవాక, దయాళ్ నగర్, మహారాణి పేట, కంచరపాలెం, దుర్గానగర్, రాంనగర్, ఎంవీపీ కాలనీ, పెందుర్తి, మద్దిలపాలెం, సిరిపురం సర్కిల్, భీమునిపట్నం, మర్రిపాలెం, ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంతాల్లో భవనాలు కేటాయించారు. మిగతా 19 శాఖలకు భవనాలను గుర్తించాల్సి ఉందని తెలిపారు. ఆర్‌టీజీఎస్, సాంఘిక సంక్షేమం, ఆర్థిక, సాధారణ పరిపాలన, గ్రామ, వార్డు సచివాలయాలు, ఉన్నత విద్య, గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాలు ఐటీ, కార్మిక, న్యాయ, మైనారిటీ సంక్షేమం తదితర శాఖలకు వసతి గుర్తించాల్సి ఉందన్నారు. ఏ శాఖకైనా విశాఖలో సొంత భవనాలు ఉంటే వాటిలో కార్యాలయాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సీనియర్ అధికారుల గృహ వసతి కోసం ముందుగా సొంత భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. మిలీనియం టవర్లలో వసతి కేటాయింపులపై ఐటీ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తర్వులకు అనుగుణంగా సచివాలయానికి సంబంధించిన అన్ని శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వ్యక్తిగత కక్షతోనే వ్యాజ్యం

ప్రభుత్వ పెద్దలపై విషం చిమ్మడమే రఘురామ ధ్యేయం

- ముఖ్యమంత్రిని వదిలేది లేదంటూ ప్రకటనలు చేశారు
- ఆ దురుద్దేశాలు, ఆయనకెంత విశ్వసనీయత ఉందో పరిశీలించండి
- రుణ సంస్థలకు రూ.వందల కోట్లను ఎగ్గొట్టారు.. సీబీఐ కేసూ నమోదైంది
- పిల్ విచారణార్హతపై తేల్చాకే కేసు పూర్వాపరాల్లోకి వెళ్లాలి
- ఏపీ హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్
- అంగీకరించిన ధర్మాసనం.. ప్రతివాదులందరికీ నోటీసులు

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదిస్తూ నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు హైకోర్టును ఆశ్రయించారు. సంక్షేమ పథకాల్లో అక్రమాలు జరిగాయని, పలువురికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలున్నాయని, వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ వ్యాజ్యంలో ముఖ్యమంత్రి జగన్, ఎంపీ వి.విజయసాయిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేయడంపై అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ అభ్యంతరం తెలిపారు. దురుద్దేశాలతోనే వీరందరినీ వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారని నివేదించారు. ప్రభుత్వంపై, రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారిపై రఘురామ విషం చిమ్మడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. వ్యక్తిగత కక్షతోనే ఆయన ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారన్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలను తప్పుబడుతూ వ్యాజ్యం దాఖలు చేస్తున్నట్లు పేర్కొన్న రఘురామ అందులో సంబంధం లేని వారిని వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారన్నారు. ఈ పిల్ దాఖలు చేసిన తరువాత ముఖ్యమంత్రిని వదిలేదంటూ మీడియా సమావేశాలు నిర్వహించి ప్రకటనలు చేశారని నివేదించారు.

అందుకు అనుమతించొద్దు
ప్రజా ప్రయోజనం పేరుతో వ్యాజ్యం దాఖలు చేసిన రఘురామ వాస్తవాలను కోర్టు ముందు ఉంచలేదని ఏజీ శ్రీరామ్ తెలిపారు. తనకు సంబంధించిన అన్ని విషయాలను పిల్‌లో పేర్కొన్నట్లు డిక్లరేషన్ ఇచ్చిన రఘురామ వాస్తవానికి పలు కీలక విషయాలను తొక్కిపెట్టారన్నారు. ఆయన చైర్మన్, ఎండీగా వ్యవహరించిన కంపెనీ పలు రుణ సంస్థలకు రూ.700 కోట్లకు పైగా రుణాలను ఎగవేసిందన్నారు. పిటిషనర్ సీబీఐ కేసు కూడా ఎదుర్కొంటున్నారని శ్రీరామ్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వివరాలను ఆయన వ్యాజ్యంలో పేర్కొనలేదన్నారు. వ్యక్తిగత, రాజకీయ ఎజెండాతో రఘురామ ముందుకెళుతున్నారని, అందుకు ఈ వ్యాజ్యమే ఉదాహరణ అని పేర్కొన్నారు. దీనికి ఎంత మాత్రం అనుమతించొద్దని కోర్టును ఏజీ అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం విచారణార్హతపై తమకు అభ్యంతరం ఉందన్నారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపే ముందు రఘురామకృష్ణరాజు దురుద్దేశాలను, ఆయనకెంత విశ్వసనీయత ఉందో పరిశీలించాలని కోరారు. ముందు దీన్ని తేల్చిన తరువాతే ఈ వ్యాజ్యంలో తదుపరి విచారణను చేపట్టాలన్నారు. పిల్ నిబంధనల ప్రకారం ప్రతివాదుల జాబితా నుంచి ఎవరినైనా తొలగించే అధికారం ధర్మాసనానికి ఉందన్నారు.

ముందు విచారణార్హతపై తేలుస్తాం..
వాదనలు విన్న హైకోర్టు తొలుత రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన ఈ వ్యాజ్యం విచారణార్హతపై తేలుస్తామని స్పష్టం చేసింది. ఆ తరువాతే తదుపరి ప్రక్రియ చేపడతామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రతివాదులందరూ విచారణార్హతపై అభ్యంతరాలు తెలియచేయాలని, అందువల్ల వారందరికీ నోటీసులు జారీ చేస్తామని తెలిపింది. రేపు ఎవరూ తమకు వాదనలు వినిపించే అవకాశం రాలేదని అనకూడదని పేర్కొంది. న్యాయ ప్రయోజనాల నిమిత్తం అందరికీ నోటీసులు జారీ చేస్తున్నామంది. నోటీసులు జారీ చేయడం అందరికీ మంచిదని హైకోర్టు స్పష్టం చేసింది.

పలువురికి నోటీసులు జారీ...
ఈమేరకు వ్యక్తిగత ప్రతివాదులుగా ఉన్న ముఖ్యమంత్రి జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డిలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పలు కంపెనీలకు, డైరెక్టర్లకు కూడా నోటీసులు ఇచ్చింది. సీబీఐ డైరెక్టర్, కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్థిక, రెవెన్యూ, గనులు, పరిశ్రమలు, సమాచార పౌర సంబంధాలు, వైద్య, ఆరోగ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులకు సైతం నోటీసులు జారీ చేసింది. మొత్తం 41 మందికి నోటీసులు ఇచ్చిన హైకోర్టు వారందరినీ రఘురామకృష్ణరాజు వ్యాజ్యం విచారణార్హతపై అభ్యంతరాలను తెలియచేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 14కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. మధ్యంతర ఉత్తర్వుల కోసం తాము అనుబంధ పిటిషన్ దాఖలు చేశామని, దాన్ని అనుమతించాలని రఘురామకృష్ణరాజు తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు కోరారు. ఇసుక, మద్యం పాలసీలకు సంబంధించిన రికార్డులను జాగ్రత్త చేసేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. ఆ పాలసీలకు సంబంధించిన రికార్డులను ధ్వంసం చేస్తున్నారని, వాటిని సీజ్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఏయూ రంగస్థలానికి పూర్వవైభవం

- నేడు ప్రారంభించనున్న నాగార్జున



విశాఖ (ఏయూ క్యాంపస్): ఆంధ్రా విశ్వకళా పరిషత్ తన పేరును సార్థకం చేసుకుంటూ చిత్రకళలు, నాటక రంగం, సంగీతం, నృత్యం నుంచి నేటి సినీ సంగీతం వరకు ఎందరో ఉద్దండులను సమాజానికి అందించే బృహత్తర బాధ్యతను నిర్విరామంగా నిర్వహిస్తోంది. దశాబ్దాల క్రితం కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఆరుబయలు రంగస్థలం దాదాపు రెండున్నర దశాబ్దాలుగా నిరాదరణకు గురైంది. ప్రస్తుత వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి చొరవ తీసుకుని దీనిని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి వినియోగంలోకి తెచ్చారు.

1940లో పునాదిరాయి
ఎస్కిన్ స్క్వేర్ పేరిట 1940లో అప్పటి మద్రాసు గవర్నర్ రూథర్‌ఫర్డ్ ప్రారంభించబడిన ఏయూ కళాప్రాంగణం ఘనమైన చరిత్రకు సాక్ష్యంగా నిలిచింది. ఇక్కడ ప్రదర్శించిన నాటకాలను వీక్షించేందుకు అక్కినేని నాగేశ్వరరావు, ఎన్టీ రామారావు వంటి తెలుగు సినిమా అగ్ర కథానాయకులు వచ్చేవారు. రంగస్థల చారిత్రక, కళాప్రాశస్త్యాలు దెబ్బతినకుండా నేటి తరానికి ఉపయుక్తంగా సర్వహంగులతో సిద్ధం చేశారు. సినీ నటుడు అక్కినేని నాగార్జున, అమల, అఖిల్, అక్కినేని సుశీల శుక్రవారం జరిగే కార్యక్రమంలో దీనిని ప్రారంభిస్తారు.

మే 26న జేఈఈ అడ్వాన్స్‌డ్

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను వచ్చే సంవత్సరం మే 26న నిర్వహిస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) గురువారం ప్రకటించింది. 2024 ఏప్రిల్ 21 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారంది. మే 6 నాటికి పరీక్షఫీజు చెల్లించాలని, మే 17 నుంచి అడ్మిట్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టీఏ పేర్కొంది. జేఈఈ మెయిన్స్ పరీక్ష జనవరి, ఏప్రిల్‌లో జరుగుతుంది. ఇందులో అర్హత పొందినవారిలో 2 లక్షలమందికి అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత కల్పిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో వచ్చే ర్యాంకు ఆధారంగా దేశంలోని ఐఐటీల్లో ఇంజనీరింగ్ సీట్లు కేటాయిస్తారు. మెయిన్స్‌లో సాధించే ర్యాంకు ఆధారంగా ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే కాలేజీల్లో సీట్లు కేటాయిస్తారు.

జిల్లా వార్తలు

అటవీ ఉత్పత్తుల సేకరణతో ఆదాయం


విజయ్‌కుమార్, జీసీసీ డివిజనల్ మేనేజర్

దమ్మపేట: అటవీ ప్రాంతాల్లోని గిరిజనులు కలపేతర అటవీ ఉత్పత్తులను సేకరించి ఆదాయం పొందొచ్చని గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ విజయ్‌కుమార్ తెలిపారు. దమ్మపేట మండల కేంద్రంలోని జీసీసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ ప్రాంతంలో లభించే తబ్సి జిగురు, చిల్ల గింజలు, ముష్టిగింజలు తదితర ఉత్పత్తులను సేకరించి జీసీసీ కేంద్రాల్లో విక్రయించవచ్చని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రదర్శించే పట్టికలతో ధర ఆధారంగా నగదు లభిస్తుందని వివరించారు. ఈసమావేశంలో జీసీసీ మేనేజర్ సుగ్గల నర్సింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి 30 వరకు మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: వారాంతపు సెలవులు, కార్తీక పౌర్ణమి, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న శనివారం, 26న ఆదివారం వారాంతపు సెలవులు కాగా, 27 సోమవారం గురునానక్ జయంతి/కార్తీక పౌర్ణమితో పాటు చాంబర్ బాధ్యుల అభ్యర్థన మేర కు 28న మంగళవారం సెలవు ప్రకటించామని పేర్కొన్నారు. ఇక 29, 30వ తేదీల్లో ఎన్నికల నేపథ్యాన సెలవులు ప్రకటించగా, డిసెంబర్ 1వ తేదీన మార్కెట్‌లో పంట క్రయవిక్రయాలు జరుగుతాయని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన కోరారు.

27వరకు వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

నేలకొండపల్లి: ముదిగొండ మండలంలోని సువర్ణపురం ఉషశ్రీ జిన్నింగ్ మిల్‌లో సీసీఐ ద్వారా చేపడుతున్న పత్తి కొనుగోళ్లను ఈనెల 27 వరకు నిలిపివేస్తున్నట్లు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా 24, 25వ తేదీల్లో కొనుగోళ్లు జరగవని, 26వ తేదీ ఆదివారం, 27న గురునానక్ జయంతి సందర్భంగా కొనుగోళ్లు నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. తిరిగి 28వ తేదీ నుంచి రైతులు పత్తి తీసుకురావాలని ఆయన సూచించారు.

ప్రచారానికి అదనపు హంగులు!

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అభ్యర్థుల వెంట పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉంటున్నప్పటికీ అదనపు ఆకర్షణ కోసం కళాకారులను పిలిపిస్తున్నారు. డీజే పాటలకు తోడు కోలాటం, గిరిజనుల సంప్రదాయ వేషధారణలో నృత్యాలు, కొమ్ము నృత్యాలు చేసే కళాకారులు ఉంటుండగా ప్రచార సభలు కళకళలాడుతున్నాయి. ఇదే సమయాన కళాకారులకు ఉపాధి సైతం లభిస్తోంది. - కామేపల్లి


గిరిజనుల సంప్రదాయ వేషధారణలో మహిళల నృత్యం


ఆదివాసీల కొమ్ము నృత్యం


కోలాటం ఆడుతున్న మహిళలు

నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాలు


మాట్లాడుతున్న ఏసీపీ శంకర్

ఖమ్మంక్రైం: సాంకేతిక పరిజ్ఞానంతో పాటే సైబర్ నేరాలు సైతం పెరుగుతున్నాయని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏసీపీ శంకర్ తెలిపారు. ఈ తరహా నేరాల్లో నిందితులు ఎక్కడా ప్రత్యక్షంగా కనిపించరని చెప్పారు. ఖమ్మంలోని ప్రభుత్వ ఐటీఐతో పాటు పలు కళాశాలల్లో గురువారం ఏర్పాటుచేసిన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సైబర్ నేరస్తుల బారిన పడొద్దని సూచించారు. ఈ విషయమై అవగాహన పెంచుకుని ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం టోల్ ఫ్రీ నంబర్, ఇతర అంశాలను వివరించారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు కల్పించారు.

స్టిక్కర్లతో ప్రచారం


స్టిక్కర్ అంటిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 30న జరగనుండగా, అందరూ ఓటు వేసేలా అధికారులు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మం కలెక్టర్ గౌతమ్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని వాహనాలకు అంటించేందుకు స్టిక్కర్లు చేయించారు. వీటిని గురువారం అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ ఉద్యోగుల ద్విచక్రవాహనాలపై అంటించారు. తద్వారా ఉద్యోగులతోపాటు ఇతర ప్రజలకు అవగాహన కల్పించినట్లవుతుందని చెబుతున్నారు.
- ఖమ్మం సహకారనగర్


పోలింగ్ తేదీని తెలిపే స్టిక్కర్లు

సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణమ్మ

పాల్వంచ: రైతులు సమీకృత వ్యవసాయ విధానంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ సూచించారు. గురువారం మండలంలోని జగన్నాథపురంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సహకారంతో సమీకృత వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పంటలతో పాటు ఉద్యానవన పంటలు సాగు చేయడం, కోళ్ల పెంపకం, పశువుల పెంపకం, చేపల పెంపకం వంటివి చేపట్టి అదనపు ఆదాయం పొందాలన్నారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నవీన్‌కుమార్ మాట్లాడుతూ కిసాన్ సారథి ద్వారా జిల్లాలో 13 వేల మంది రైతులకు వ్యవసాయ సమాచారంతో కూడిన లఘు సందేశాలను పంపిస్తున్నట్లు తెలిపారు. సంస్థ జేడీఎం డాక్టర్ వెంకయ్య, నోడల్ అధికారి వెంకటరత్నం, గ్రామ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ముక్కోటి టికెట్ల విక్రయాలు

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహించే ముక్కోటి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఉత్తర ద్వార దర్శనం టికెట్ల విక్రయాలు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆలయ ఈఓ రమాదేవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ అధికారులు ఆన్‌లైన్ ద్వారా టికెట్ల విక్రయాలను ఈ నెల 22 నుంచి ప్రారంభించగా గురువారానికి వీఐపీ టికెట్లు 700కి 138, సెక్టార్–ఏ 300కి 79, సెక్టార్–బి 650కి 72, సెక్టార్–సి 100కి 93, సెక్టార్–డి 100కి 8, సెక్టార్–ఈ 500కి 74 భక్తులు బుక్ చేసుకున్నట్లు ఈఓ వెల్లడించారు.

బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు అష్టకష్టాలు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ


మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి, పక్కన కూనంనేని

పాల్వంచ : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. పట్టణంలోని కరకవాగు, సీతారాంపట్నం, గట్టాయిగూడెం, ఒడ్డుగూడెం, శ్రీనగర్ కాలనీ, ప్రియదర్శిని కాలనీ, నవభారత్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో గురువారం కూనంనేని సాంబశివరావు విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో వనమా వెంకటేశ్వరరావు తన స్వార్థ ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్‌లో చేరి కాంగ్రెస్‌కు, బీసీలకు నమ్మక ద్రోహం చేశారని, ఆయన తనయుడు నియోజకవర్గంలో కుటుంబాలను కూలుస్తూ రాక్షస ఆనందాన్ని పొందాడని ఆరోపించారు. మరో అభ్యర్థి సింహంలా జూలు విడిచి ప్రజలపై అనేక దండయాత్రలు చేసిన ఘటనలు 2014 నుంచి 18 వరకు చూశామన్నారు. కూనంనేని నిబద్ధత, నిజాయితీ, నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పనిచేసిన వ్యక్తిగా అందరి గుండెల్లో చోటు సంపాదించాడని, ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నో సమస్యలపై తాను పోరాటం చేశానని, తాను చేసిన కృషి ప్రతి గడపకూ తెలుసని అన్నారు. ఇక్కడి ప్రజలతో తనకు 45 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కంకీ కొడవలి గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, నాగ సీతారాములు, నూకల రంగారావు, టీడీపీ నాయకులు కనగాల అనంతరాములు, నల్లమల్ల వేణు, వీరమాచినేని రత్నాకర్, పొందూరి నరసింహారావు, నరేశ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, బండి నాగేశ్వరరావు, రాహుల్, గుండాల నాగరాజు, అన్నారపు వెంకటేశ్వర్లు, విశ్వేశ్వరరావు, శనగరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పది సీట్లూ గెలుస్తాం

కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంటరీ పరిశీలకుడు ఆరిఫ్ నసీంఖాన్


సమావేశంలో మాట్లాడుతున్న ఆరిఫ్ నసీమ్‌ఖాన్

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పోటీ చేస్తున్న తొమ్మిది స్థానాలతో పాటు మిత్రపక్షమైన సీపీఐ పోటీ చేస్తున్న కొత్తగూడెం కలిపి పది సీట్లు గెలుచుకుంటామని కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ఆరిఫ్ నసీమ్‌ఖాన్ అన్నారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ ఉందని తెలిపారు. ఈమేరకు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ అగ్రనేత ప్రియాంగాంధీ శుక్ర, శనివారాల్లో జిల్లాలో పర్యటిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా కొత్తగూడెం, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర అభ్యర్థుల తరఫున జరిగే రోడ్డు షోలు, సభల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జ్ బీఆర్.అనిల్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, నాయకులు మహ్మద్ ముస్తఫా, షాకూర్ నగాని, రామ్మూర్తినాయక్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, కొంటెముక్కల నాగేశ్వరరావు, ఏలూరి రవికుమార్ పాల్గొన్నారు.